జాతీయ వార్తను ఈ-పేపర్‌లోనూ,
డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.జాతీయవార్త.కామ్‌లో
కూడా వీక్షించవచ్చు.
epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

జాతీయ
# వార్త
తెలుగు దిన పత్రిక

చదవండి.. చదివించండి..
జాతీయ వార్త తెలుగు దినపత్రిక
మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రికలో ప్రచురిస్తాం. మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761
epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

శుక్రవారం | 6-2-2026 | శ్రీకాకుళం | సంపుటి: 3 సంచిక: 584 పేజీలు: 4 వెల: రూ.7

## తీరం భద్రతకు..

* 58 తీర ప్రాంత గ్రామాలు దత్తత
* సీఐఎస్ఎఫ్ డీజీ ప్రవీర్ రంజన్
* సీఐఎస్ఎఫ్ జవాన్ల సాహసయాత్ర స్ఫూర్తిదాయకం
* శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్
* కళింగపట్నంలో ఘనంగా సీఐఎస్ఎఫ్ సైక్లథాన్



# ప్రజలే రక్షణ కవచం

**శ్రీకాకుళం, ఫిబ్రవరి 5(వార్త):** భారతదేశ సముద్ర తీర భద్రత కేవలం రక్షణ దళాలతోనే సాధ్యం కాదని, తీర ప్రాంత ప్రజలు, మత్స్యకారుల భాగస్వామ్యంతోనే మరింత పటిష్టం అవుతుందని సీఐఎస్ఎఫ్ డైరెక్టర్ జనరల్ ప్రవీర్ రంజన్ అన్నారు. కేంద్ర పారిశ్రామిక భద్రతా దళం ఆధ్వర్యంలో చేపట్టిన 'వందేమాతరం కోస్టల్ సైక్లథాన్-2026' బృందం గురువారం కళింగపట్నం చేరుకుంది. ఈ సందర్భంగా స్థానిక బుద్ధా స్కూల్ వద్ద నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. దేశవ్యాప్తంగా 52 తీర ప్రాంత గ్రామాలను సీఐఎస్ఎఫ్ దత్తత తీసుకుంటోందన్నారు. ఈ గ్రామాల్లో ఏడాది పొడవునా విద్య, క్రీడలు, మౌలిక సదుపాయాల కల్పన వంటి సామాజిక బాధ్యత కార్యక్రమాలను ఓఎన్‌జీసీ, పోర్ట్ అథారిటీల సహకారంతో నిర్వహించనున్నట్లు తెలిపారు. పశ్చిమ బెంగాల్‌లోని బఖాలీ నుండి ఒక బృందం, గుజరాత్‌లోని లఖ్‌పత్ నుండి మరో బృందం తన ప్రయాణాన్ని మొదలుపెట్టిందని, ఈ రెండు బృందాలు 9 తీరప్రాంత రాష్ట్రాలు, 2 కేంద్రపాలిత ప్రాంతాల గుండా సుమారు 6,600 కిలోమీటర్లు ప్రయాణించి, ఫిబ్రవరి 22న కేరళలోని కొచ్చి వద్ద తమ యాత్రను ముగిస్తాయన్నారు. శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ మాట్లాడుతూ దేశ భద్రతలో సముద్ర తీరాల రక్షణ అత్యంత కీలకమని, దానికోసం సిఐఎస్ఎఫ్ జవాన్లు చేస్తున్న సాహసయాత్ర స్ఫూర్తిదాయకమన్నారు. కోస్టల్ భద్రతతో పాటు దేశభక్తిని పెంపొందించే ఇలాంటి కార్యక్రమాలు అభినందనీయమని, పురుషులతో సమానంగా మహిళా జవాన్లు సైతం ఈ సైకిల్ యాత్రలో పాల్గొనడం గర్వకారణమన్నారు. యువత దేశ రక్షణకు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు.



సీఐఎస్ఎఫ్ కమాండెంట్ దువ్వాడ జితేంద్రబాబు మాట్లాడుతూ తీర భద్రత దేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముక వంటిదని స్పష్టం చేశారు. ఉద్యోగార్థులైన యువతకు తీపి కబురు అందిస్తూ.. గత ఏడాది సీఐఎస్ఎఫ్‌లో 16,000 పోస్టులను భర్తీ చేశామని, ఈ ఏడాది మరో 15,000 ఖాళీల భర్తీ జరుగుతుందని వెల్లడించారు. ఈ అవకాశాలపై యువతకు విస్తృత అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. కేవలం శాంతిభద్రతలే కాకుండా, దేశ సంపదను కాపాడటంలో సీఐఎస్ఎఫ్ పాత్రను వివరించారు. అనంతరం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి.



విద్యార్థుల 'మహాగణపతిం' నృత్య ప్రదర్శనతో ప్రారంభమైన వేడుకల్లో.. రాజారావు బృందం అందించిన సాక్సోఫోన్ ప్రదర్శన వినసొంపుగా సాగింది. కుమారి హారిక ఆలపించిన గీతాలు, మాస్టర్ కామేశ్వర్ కోలాటం బృందం ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. యాత్ర బృందానికి ప్రజలు బ్రహ్మరథం పట్టారు. ఈ కార్యక్రమంలో సీఐఎస్ఎఫ్ సౌత్ జోన్ డీఐజీ డాక్టర్ ఎం.జి. రాఘవేంద్ర కుమార్, సీనియర్ కమాండెంట్ సతీష్ కుమార్ బాజ్‌పాయ్, తదితర ఉన్నతాధికారులతో పాటు స్థానిక ప్రముఖులు, పాఠశాల ఉపాధ్యాయులు, పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

## ఫుట్ పాత్ వ్యాపారులపై టీడీపీ నేత దౌర్జన్యం

* ఆందోళనకు దిగిన వ్యాపారులు
* ఆ నేతపై ఎమ్మెల్యే శిరీష ఆగ్రహం



లోపల పేజీల్లో

## శ్రీముఖలింగంలో 15-18 వరకు మహా శివరాత్రి మహోత్సవాలు

* భక్తులకు ఇబ్బందుల్లేకుండా పకడ్బందీ ఏర్పాట్లు
* ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి
* అధికారులతో సమీక్ష



## క్రైం వార్తలు



### పుస్తెలతాడు చోరీ ఘటనలో ముగ్గురు అరెస్టు

**శ్రీకాకుళం క్రైం, ఫిబ్రవరి 5 (వార్త):** పుస్తెలతాడు చోరీకి పాల్పడిన ఘటనలో ముగ్గురిని అరెస్టు చేశామని శ్రీకాకుళం టౌన్ డీఎస్పీ సీహెచ్ వివేకానంద తెలిపారు. గురువారం మీడియా సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. గత నెల 30న ముగ్గురు గుర్తుతెలియని వ్యక్తులు శ్రీకాకుళం మండలం నందగిరిపేటకు చెందిన పాతిన భూదేవమ్మ అనే వృద్ధురాలి మెడలో 32.4 గ్రాముల బంగారం పుస్తెలతాడును తెంచి పారిపోయారన్నారు. ఆమదాలవలస మండలం మెట్టక్కివలసకి చెందిన మెండ వెంకటరమణ, గుంట ప్రమీల, గుంట జగదీశ్వరరావు ఈ చోరీకి పాల్పడ్డారన్నారు. ఈ ముగ్గురు ఇరవై రోజుల పాటు భూదేవమ్మ ఇంటి వద్ద రెక్కీ నిర్వహించారన్నారు. ఈనెల30న ఉదయం భూదేవమ్మ ఇంటికి ప్రమీల, వెంకటరమణలు ఖాళీసీసాతో వెళ్లి నీరు కావాలని అడిగారన్నారు. భూదేవమ్మ నీరు తెచ్చేందుకు ఇంట్లోకి వెళ్తుండగా.. ఆమె మెడలో ఉన్న బంగారం పుస్తెలతాడును వెంకటరమణ తెంచివేసి కారులో పరారయ్యారన్నారు. ఆమె కుమారుడు రామచంద్రరావు ఫిర్యాదు మేరకు శ్రీకాకుళం రూరల్ ఎస్ఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారన్నారు. ఈ బంగారం పుస్తెలతాడును వారు విక్రయించేందుకు వెళుతుండగా శ్రీకాకుళం రూరల్ పోలీసులు గురువారం పట్టుకున్నారన్నారు. చోరీకి గురైన రూ.5లక్షల విలువైన 32.4 గ్రాముల బంగారం పుస్తెలతాడును రికవరీ చేశామని చెప్పారు. అలాగే మూడు సెల్‌పోన్లు, కారును సీజ్ చేశామని డీఎస్పీ వివేకానంద తెలిపారు. సమావేశంలో శ్రీకాకుళం రూరల్ సీఐ పైడిపునాయుడు, ఎస్ఐ రాము ఉన్నారు.

### పదో తరగతి పరీక్షల ఫీజుకు తత్కాల్ అవకాశం

**శ్రీకాకుళం టౌన్, ఫిబ్రవరి 5(వార్త):** మార్చి-2026 పదో తరగతి వార్షిక పరీక్షలకు హాజరయ్యే రెగ్యులర్, ఫెయిలైన విద్యార్థులు పరీక్ష ఫీజు చెల్లించేందుకు 'తత్కాల్' పథకం కింద ప్రభుత్వం చివరి అవకాశం కల్పించినట్లు జిల్లా విద్యాశాఖాధికారి రవిబాబు ఒక ప్రకటనలో తెలిపారు. వివిధ కారణాలతో ఫీజు చెల్లించలేకపోయిన విద్యార్థులు రూ.1,000 ఆలస్య రుసుముతో ఈ నెల 6 నుంచి 12వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. ప్రధానోపాధ్యాయులు సంబంధిత పత్రాలను www.bseap.org వెబ్‌సైట్‌లో సమర్పించాలని, విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

## భూ వివాద కేసులు..

# సమన్వయంతో పరిష్కరించండి

* రెవెన్యూ, పోలీస్ అధికారులు సమన్వయంతో కలిసికట్టుగా పనిచేయాలి
* అధికార దుర్వినియోగం జరగకూడదు
* రెవిన్యూ సదస్సులో జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

**శ్రీకాకుళం, ఫిబ్రవరి 5(వార్త):** జిల్లాలో భూవివాద కేసులపై ప్రత్యేక దృష్టి సారించి పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం జిల్లా కలెక్టర్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధ్యక్షతన జిల్లా సూపరిండెంట్ ఆఫ్ పోలీస్, జిల్లా రెవెన్యూ అధికారి, జిల్లాలో గల ఆర్డీవోలు, తహశీల్దార్లు, పోలీస్ అధికారులతో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రెవిన్యూ, పోలీసు యంత్రాంగం సమన్వయంతో పని చేసి పోలీస్ స్టేషన్ వారీగా భూ వివాద కేసుల వివరాలు తెలుసుకుని పరిష్కరించేలా చూడాలన్నారు. ఎక్కడ ఎటువంటి అధికార దుర్వినియోగం జరగరాదన్నారు. జిల్లా ఎస్పీ కేవీ మహేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ తప్పుడు కేసులకు అండదండలు అందించిన వారికి భయం కలిగేలా బైండ్ ఓవర్ కేసుల్లో పూచికత్తుగా ఉన్న మొత్తాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ తగ్గించకూడదన్నారు. తప్పు చేయాలనే ఉద్దేశం ఉన్నవారికి కేసుల భయం, ఆర్థిక భారం దృష్టికి వచ్చేలా అధికారులు కఠినంగా వ్యవహరించాలన్నారు. జిల్లాలో ఇప్పటివరకు 292 కేసులు జనవరికి ముందు ఉన్నాయని వాటిని పరిష్కరించేందుకు తగిన చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. జిల్లా రెవెన్యూ అధికారి ఎస్వీ లక్ష్మణమూర్తి మాట్లాడుతూ గతంలో పోలీసు యంత్రాంగం కంటే రెవెన్యూ యంత్రాంగం దగ్గరే ఇటువంటి కేసుల వివరాలు ఉండేవన్నారు. అప్పట్లో నాయుడు కరణం తలయారి గ్రామాల్లో వివరాల సేకరణలో ముందంజలో ఉండేవారని, ఇప్పటికీ రిటైర్ అయి గ్రామాల్లో ఉన్న నాయుడు, కారణం తదితర వాళ్ల సహాయంతో రెవెన్యూ వ్యవస్థలో మార్పు తీసుకురావాలని అన్నారు. తహసిల్దార్లు, వీఆర్వోలు వివరాల సేకరణలో పోలీసు అధికారులకు తగు సమాచారం అందించాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా ఎస్పీ కేవీ మహేశ్వర్ రెడ్డి, డిఆర్ఓ ఎస్ వి లక్ష్మణమూర్తి, శ్రీకాకుళం ఆర్డీవో సాయి ప్రత్యూష, పలాస ఆర్డిఓ వెంకటేశ్వరరావు, టెక్కలి ఆర్డిఓ కృష్ణమూర్తి, ఎమ్మార్వోలు, పోలీస్ అధికారులు పాల్గొన్నారు.



# నేడు మందసలో ఎంఎల్ఏ గౌతు శిరీషా పర్యటన



**మందస, ఫిబ్రవరి 5(వార్త):** పలాస నియోజకవర్గం ఎంఎల్ఏ గౌతు శిరీషా ఈ నెల 6న మందస మండలంలో పర్యటించనున్నారని తెలుగుదేశం పార్టీ మందస మండల అధ్యక్షుడు బావన దుర్యోధన చెప్పారు. ఉదయం 9.30గంటలకు సొండిపూడి గ్రామంలో విలేజ్ హెల్త్ క్లినిక్ ప్రారంభోత్సవం చేస్తారని, 10గంటలకు సిద్ధిగాం గ్రామ పంచాయతీ శ్రీరాంపురం గ్రామం వద్ద మందస పీఏసీఎస్ నిర్మించిన ఎం పీఎఫ్ సీ గోదాం ప్రారంభోత్సవం చేస్తారన్నారు. 11గంటలకు గొడుగురంటి నుండి అంబటికంబారం గ్రామం వరకు వేసిన బీటీ రోడ్డు ప్రారంభోత్సవం చేస్తారని, మధ్యాహ్నం 12గంటలకు హోన్నాలి గ్రామ పంచాయతీ కొరడాబడి గ్రామంలో అంగన్వాడీ భవనం ప్రారంభోత్సవం చేస్తారన్నారు. సాయంత్రం 3.30గంటలకు మందస టౌన్ లో జలజీవన్ మిషన్ శంకుస్థాపన కార్యక్రమం జరుగుతుందని, సాయంత్రం 4.30గంటలకు కొంకడాపుట్టి గ్రామంలో జలజీవన్ మిషన్ ఇంటింటికీ కుళాయిలు ప్రారంభోత్సవం కార్యక్రమాలలో పాల్గొననున్నారు. అధికారులు, కూటమి నాయకులు, కార్యకర్తలు హాజరు కావాలని ఆయన కోరారు.

## కేజీబీవీ విద్యార్థినులకు కళ్లద్దాల పంపిణీ



**మందస, ఫిబ్రవరి 5(వార్త):** జాతీయ ఆంధత్వ నివారణ, దృష్టి లోప నివారణ కార్యక్రమంలో భాగంగా జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థినిలకు కళ్ల అద్దాలు పంపిణీ జరిగింది. వీరగున్నమ్మపురం వద్ద గల కస్తూరిభాగాంధీ బాలికల విద్యాలయంలో దృష్టి లోపం ఉన్న 32విద్యార్థినిలకు ప్రభుత్వం తరపున ఉచితంగా కళ్ల అద్దాలు అందజేశారు. ఆప్తాల్మిక్ అధికారి రోణంకి వెంకటరమణ మాట్లాడుతూ దృష్టి లోపం ఉన్న వారు కళ్ల అద్దాలు తప్పనిసరిగా వాడాలని, ప్రతీ సంవత్సరశీ క్రమం తప్పకుండా కంటి పరీక్ష చేయించుకోవాలన్నారు. స్మార్ట్ ఫోన్ ఎక్కువ గా చూడకూడదని, ప్రిన్సిపల్ ఆర్.వాసంతి చెప్పారు. చిన్న వయసులో దృష్టి సమస్యలని గుర్తించి కళ్ల అద్దాలు ఇవ్వడం మంచి కార్యక్రమమని పేర్కొన్నారు. కళ్ల అద్దాలును విద్యార్థులకు అందజేశారు. కార్యక్రమం లో ఉపాధ్యాయినిలు బి.భాగ్యలక్ష్మి, ఎస్.భాగ్యలక్ష్మి, ఎల్.లలితకుమారి, ఎం.ఇంద్రావతి, భవాని, లావణ్య, మీనా, ఉమాసుందరి, భాగ్యలక్ష్మి, పావని, అశ్విని, శ్రావణి పాల్గొన్నారు.

## రీ సర్వేతో భూ సమస్యలకు పరిష్కారం




**జి.సిగడాం, ఫిబ్రవరి 5(వార్త):** ప్రభుత్వం చేపడుతున్న రీసర్వేతో భూ సమస్యలు తొలగి భూ యజమానులకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని సర్వేయర్ సి.కిషోర్ బాబు అన్నారు. గురువారం పెంట గ్రామంలో ప్రజాప్రతినిధిలు, గ్రామ పెద్దలతో కలిసి రైతుల సమక్షంలో రీ సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రీసర్వే వల్ల వివాదాలకు ముగింపు పలకడమే కాకుండా పారదర్శకమైన రికార్డులు అందుబాటులోకి వస్తాయని వివరించారు. గ్రామంలో భూ రికార్డులు సాంకేతికంగా,లోపాలు పేర్లు తప్పు వల్ల రైతులు పడుతున్న ఇబ్బందులు దృష్టిలో పెట్టుకొని తగు చర్యలు చేపడుతున్నామన్నారు. రైతులు ఈ రీసర్వేని సద్వినియోగం చేసుకోవాలని రైతులు తమకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో అదనపు సర్వేయరు ప్రమీల, వీఆర్వో భూపతి నర్సింగరావు, సర్పంచ్ పున్నాన సోనియా, ఎంపీటీసీ మక్కశ్రీలత, గ్రామస్తులు మక్క నారాయణరావు, పున్నాన పాపినాయుడు పాల్గొన్నారు.

## శభాష్ నిరంజన్

**- సీఎం చంద్రబాబు కితాబు**



**పలాస, ఫిబ్రవరి 5 (వార్త):** శభాష్ గొనప నిరంజన్ అంటూ తనని మెచ్చుకోలుగా ముఖ్యమంత్రి చంద్రబాబు కితాబు ఇచ్చారని నీటి సంఘం అధ్యక్షులు గొనప నిరంజన్ తెలిపారు. గురువారం అమరావతిలో సాగునీటి సంఘాల సమావేశంలో వేదిక పైకి పిలిచి, పెద్దలందరు కలిసి సన్మానం చేయడం చాలా సంతోషంగా ఉందన్నారు. దీనికి కారణమైన మాజీ మంత్రి శివాజీ, రాష్ట్ర వ్యవసాయ, మంత్రి అచ్చన్నాయడు, ఎమ్మెల్యే శిరీష, పలాస సమన్వయకర్త వెంకన్న చౌదరి, నాయకులు, కుటుంబ సభ్యులు జిల్లా చైర్మన్ అరవల రవీంద్ర బాబు, ఇరిగేషన్ ఇఇ శేఖర్‌బాబు, జెఈ రాజశేఖర్, అధికారులు, స్నేహితులు నీటి సంఘ అధ్యక్షులు మేబెర్స్, రైతులు, అధికారులందరికీ హృదయ పూర్వక ధన్యవాదములు తెలిపారు.

## ప్రకృతి వ్యవసాయంతో ఆరోగ్య ఆంధ్రప్రదేశ్



**మందస, ఫిబ్రవరి 5(వార్త):** గ్రామాలలో ప్రకృతి వ్యవసాయ విధానంపై పూర్తిస్థాయి అవగాహన ద్వారానే ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ గా కూడా అవతరించవచ్చని వెలుగు అసిస్టెంట్ మందస ప్రాజెక్ట్ మేనేజర్ పైడి కూర్మారావు మహిళా రైతులకు సూచించారు. స్థానిక మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో వెలుగు, (ఎన్.ఎం.ఎన్.ఎఫ్) నేషనల్ మిషన్ ఆన్ నేచురల్ ఫార్మింగ్ సిబ్బంది కన్వర్జెన్సీ అవగాహన, సమీక్షా సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వం గిరిజన ప్రాంతాలలో వన్‌దన్ వికాస కేంద్రాల ఏర్పాటు చేసి, గ్రామీణ మహిళా రైతులకు ఫార్మర్ ప్రొడ్యూసర్ గ్రూపులు, ఆర్గనైజేషన్లు ఏర్పాటు చేసి.. వారికి అవసరమైన యంత్రాలు పనిముట్లుతో సహా ఉత్పత్తికి అవసరమైన రుణ సౌకర్యాన్ని కూడా కల్పిస్తున్నట్లు తెలిపారు. పశువుల ఎరువు, పెంట గత్తం, వర్మీ కంపోస్ట్, ఘన జీవామృతం, కషాయాలతో నేలతల్లి ఆరోగ్యాన్ని కాపాడుతూ అధిక ఉత్పత్తులను సాధించవచ్చని వివరించారు. ప్రతీ రైతు తనకి ఉన్న భూమిలో కనీసం 50% ఏ గ్రేడ్ గా తయారు చేసుకుని ఏటీఎం మోడల్ ను అనుసరించి ఏడాది పొడవునా కూరగాయ పంటలను పండించాలని సూచించారు. అన్ని గ్రామ సంఘాలలో అర్హత గల రైతులను గుర్తించి ఆన్‌లైన్‌లో నమోదు చేయించాలన్నారు. కార్యక్రమంలో మండల మహిళా సమాఖ్య అకౌంటెంట్ కళ్యాణి, కంప్యూటర్ ఆపరేటర్ రాజా, అధ్యక్షురాలు రమణమ్మ, వెలుగు క్లస్టర్ కోఆర్డినేటర్లు, గ్రామ సంఘం వీఓఏలు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది బాలకృష్ణ, సంతోష్ కుమార్, విశ్వనాథంతో పాటు అన్ని గ్రామాల నుంచి ఐసీఆర్పీలు, కొత్త గ్రామాల నుంచి ట్రైనీ ఐసీఆర్పీలు పాల్గొన్నారు.

## డిగిపోండిపై ఇచ్ఛాపురం జట్టు విజయం

**ఇచ్ఛాపురం, ఫిబ్రవరి 5(వార్త):** ఇచ్ఛాపురం సురంగి రాజా మైదానంలో జరుగుతున్న వెచ్చా జయంతి మెమోరియల్ అంతరాష్ట్ర క్రికెట్ టోర్నమెంట్ లో భాగమంగా ఇచ్ఛాపురం ఎఫ్‌సిసి- ఒడిశా దిగిపోండి జట్ల మధ్య జరిగిన పోటీలో 20 ఓవర్లలో ఇచ్ఛాపురం 227 పరుగులు చేసింది. కుమార్ 77, సంతోష్ 66 పరుగులు చేశారు. దిగిపోండి జట్టు 108 పరుగులకి ఆలౌట్ అయ్యింది.



# శ్రీముఖలింగంలో 15-18 వరకు మహా శివరాత్రి మహోత్సవాలు

**- భక్తులకు ఇబ్బందుల్లేకుండా పకడ్బందీ ఏర్పాట్లు**

**-ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి**



**జలుమూరు, ఫిబ్రవరి 5(వార్త):** దక్షిణ కాశీగా ప్రసిద్ధిగాంచిన శ్రీముఖలింగేశ్వర స్వామి దేవస్థానంలో ఈ నెల 15 నుండి 18వ తేదీ వరకు నిర్వహించనున్న మహా శివరాత్రి మహోత్సవాలకు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని శాఖలు సమన్వయంతో పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని నరసన్నపేట శాసన సభ్యులు బగ్గు రమణమూర్తి అధికారులను ఆదేశించారు. గురువారం శ్రీముఖలింగేశ్వర స్వామి దేవస్థానంలో ఆయన అధ్యక్షతన, శ్రీకాకుళం ఆర్డీవో సాయి ప్రత్యూషతో కలిసి సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, వేల సంవత్సరాలుగా కొనసాగుతున్న ఈ శివరాత్రి మహోత్సవాలకు ఈ ఏడాది గత ఏడాదితో పోలిస్తే భక్తుల సంఖ్య పెరిగే అవకాశం ఉందని, సుమారు 70 నుండి 80 వేల మంది భక్తులు హాజరయ్యే అంచనా ఉన్నట్లు తెలిపారు. భక్తుల భద్రత, క్యూలైన్ల నిర్వహణ, దర్శన సౌకర్యాలు, పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. మొబైల్ టాయిలెట్లు, స్నానాల అనంతరం దుస్తులు మార్చుకునేందుకు ప్రత్యేక గదులు ఏర్పాటు చేయాలని, ప్రసాదాల పంపిణీ సక్రమంగా జరగాలని తెలిపారు. శ్రీముఖలింగం గ్రామానికి వెలుపల బెలూన్ (బారికేడింగ్/నియంత్రణ కేంద్రం) ఏర్పాటు చేయాలని, శానిటేషన్ పనులను పంచాయతీ అధికారులు పర్యవేక్షించాలని పేర్కొన్నారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా ఏపీఈపీడిసిఎల్ అధికారులు చర్యలు తీసుకోవాలని, వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో వైద్య శిబిరాలు, అగ్నిమాపక శాఖ ఏర్పాట్లు, పార్కింగ్ వసతులపై రవాణా శాఖ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఆర్డబ్ల్యుఎస్ ద్వారా తాగునీటి సరఫరా నిరంతరంగా ఉండాలని, వంశధార నదిలో చక్రస్నానాలకు తగిన నీటి విడుదలకు చర్యలు తీసుకోవాలని సూచించారు. సాంస్కృతిక కార్యక్రమాలు, సైన్‌బోర్డులు తదితర ఏర్పాట్లపై కూడా సమావేశంలో చర్చించారు. అనంతరం ఎమ్మెల్యే ఆలయ పరిసరాలు, ఆలయ లోపలి భాగాన్ని పరిశీలించి ఏర్పాట్లపై అధికారులకు సూచనలు చేశారు. ఈ సమావేశంలో నియోజకవర్గ సమన్వయకర్త బగ్గు అర్చన, ఆర్డీవో సాయి ప్రత్యూష, దేవాదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ ప్రసాద్ పట్నాయక్, ఆలయ ఛైర్మన్ శివప్రసాద్ పాడి, డీఎస్‌ఓ సూర్యప్రకాష్, తహసీల్దార్ రామారావు, ఎంపిడీఓ వి. చిన్నమ్మడు, ఆర్అండ్‌బీ ఈఈ తిరుపతిరావు, మండల పార్టీ అధ్యక్షులు వెలమల రాజేంద్ర నాయుడు, బగ్గు గోవిందరావు, మార్కెట్ కమిటీ ఛైర్మన్ తర్ర బలరాం, గ్రామ సర్పంచ్ సతీష్ కుమార్, ఆలయ ఈఓ ఏడుకొండలు, పాలకమండలి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.


# పేద కుటుంబానికి రూ.84,900ల ఆర్థిక సాయం



**మందస, ఫిబ్రవరి 5(వార్త):** రాంపురం గ్రామానికి చెందిన జుత్తు లక్ష్మీనారాయణ పెద్ద కుమారుడు జుత్తు మహేష్(ఈశ్వరరావు) ఆరోగ్య పరిస్థితి ప్రస్తుతం చాలా విషమంగా ఉంది. రోజురోజుకీ ఆయన ఆరోగ్యం మరింత క్షీణిస్తోంది. దీంతో గ్రామస్తులంతా ఐక్యంగా రూ.84,900 అందజేశారు. గ్రామస్తుల నుంచి రూ.57,200, రాంపురం యువశక్తి గ్రూప్ నుంచి రూ.15,000, దున్న సురేష్ ఫ్రెండ్స్, మహేష్ ఫ్రెండ్స్ రూ.12,400 సేకరించి బాధిత కుటుంబానికి అందజేశారు. ఈ సందర్భంగా గ్రామ పెద్దలు మాట్లాడుతూ ఇటువంటి పరిస్థితుల్లో గ్రామం ఒక కుటుంబంలా నిలబడి చూపిస్తున్న ఐక్యత, మానవత్వం నిజంగా అభినందనీయమన్నారు. గ్రామ పెద్దల సమక్షంలో, సంబంధిత గ్రూప్ సభ్యుల మధ్యనే మహేష్ కుటుంబానికి అందజేయడం జరిగిందని, కార్యక్రమాన్ని చక్కగా ముందుండి నడిపించిన గ్రామ పెద్దలకు, యువకులకు మరియు సమన్వయం చేసిన ప్రతి ఒక్కరికీ ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. మానవత్వం, సేవాభావం, ఐక్యతకు నిలువెత్తు నిదర్శనంగా నిలిచిన రాంపురం యువశక్తి గ్రూప్ సభ్యులకు ప్రత్యేక అభినందనలు తెలిపారు. కష్ట సమయంలో ముందడుగు వేసి, స్పందించిన మీ సేవా మనస్తత్వం ప్రతి ఒక్కరికీ ఆదర్శంగా నిలుస్తుందన్నారు. ఇప్పటివరకు సహాయం చేసిన ప్రతి ఒక్కరూ, ప్రతీ రూపాయి కూడా మహేష్ ఆరోగ్యం బాగుపడాలని స్వచ్ఛమైన మనసుతో ముందుకు వచ్చినవారేనని, మన గ్రామం గొప్పతనానికి నిదర్శనంగా నిలిచిందన్నారు. మహేష్‌ను కాపాడాలని ఆ చండమ్మ తల్లి మన చేత ఈ ఆర్థిక సహాయం చేయించిందని మనస్ఫూర్తిగా నమ్ముతున్నామని, సహాయం చేసిన ప్రతి ఒక్కరికీ హృదయపూర్వక కృతజ్ఞతలన్నారు. దయ, సహృదయత, మానవత్వం మహేష్ కుటుంబానికి పెద్ద ధైర్యంగా మారిందని, ఆ చండేశ్వరి తల్లి ఆశీస్సులతో మహేష్ త్వరగా కోలుకుని మళ్లీ మన మధ్య నవ్వుతూ తిరగాలని కోరుకుందామన్నారు. కష్ట సమయంలో మన గ్రామం ఎప్పుడూ ఐక్యంగా ఉండాలని ఆకాంక్షించారు.

# వైసీపీని దేవుడు క్షమించినా ప్రజలు క్షమించరు

**జనసేన పార్టీ మందస మండల అధ్యక్షుడు కుప్పాయి గోపాలరావు**



**మందస, ఫిబ్రవరి 5(వార్త):** వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని దేవుడు క్షమించినా ప్రజలు క్షమించరని జనసేన పార్టీ మందస మండల అధ్యక్షుడు కుప్పాయి గోపాలరావు అన్నారు. మందసలో గోపాలరావు విలేకరులతో మాట్లాడుతూ తిరుమల తిరుపతి దేవస్థానంలో గత ప్రభుత్వ హయంలో శ్రీవారి లడ్డు తయారీలో నెయ్యకు బదులు రసాయనాలతో కూడిన సింథటిక్ కలిగిన నెయ్యి తయారు చేసి కల్తీ లడ్డూలను తయారు చేసి భక్తుల మనోభావాలను దెబ్బతీసే విధంగా వైసీపీ నాయకులు వ్యవహరించిన తీరును జనసేన పార్టీ మందస మండల అధ్యక్షుడు గోపాలరావు ఖండించారు. దేశంలోనే కాకుండా ప్రపంచ వ్యాప్తంగా ప్రాచుర్యం పొందిన టీటీడీ స్వామివారి లడ్డుప్రసాదం కల్తీ చేసి, అక్రమ సంపాదన లక్ష్యంగా, హిందువుల పవిత్రతను దెబ్బతీసే విధంగా రసాయనంతో కూడిన నెయ్యి సరఫరా చేయడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇటీవల సిట్ దర్యాప్తులో లడ్డు తయారీలో పూర్తిగా నెయ్యిని వినియోగించలేదని కుండబద్దలు కొట్టినట్టు చెబుతున్నప్పటికీ, వైసీపీ శ్రేణులు దీన్ని తప్పుదోవ పట్టించేందుకు రాష్ట్రంలో అనేక అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడుతూ, కుల, మత పరమైన విద్వేషాలను కలిగిస్తూ ప్రజలను మభ్యపెడుతున్నారని వాపోయారు. గత ప్రభుత్వంలో ప్రభుత్వ పేదలకు చేసిన పాపాలకు ఫలితంగా 151 సీట్ల నుండి 11 సీట్లకు దిగజారి పోయారని అన్నారు. రాష్ట్రంలో వైసిపి చేస్తున్న దిగజారుడు రాజకీయాలను ప్రజలంతా గమనిస్తున్నారని, దేవుడు క్షమించినా ప్రజలు క్షమించరని భవిష్యత్ లో మరింత గుణపాఠం చెబుతారని తెలిపారు.

# వైద్య సేవలు రోగులకు సంతృప్తినివ్వాలి

**-ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి**

**జలుమూరు, ఫిబ్రవరి 5(వార్త):** రోగులకు అందిస్తున్న వైద్య సేవలు నాణ్యతతో పాటు సంతృప్తినివ్వాలనే దిశగా వైద్య సిబ్బంది మరింత బాధ్యతతో పనిచేయాలని నరసన్నపేట శాసన సభ్యులు బగ్గు రమణమూర్తి పేర్కొన్నారు. గురువారం జలుమూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జలుమూరు, అచ్యుతాపురం, సైరిగాం ఆసుపత్రుల వైద్య సిబ్బందితో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆరోగ్య కేంద్రాల్లో రోగులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సేవలు అందించాల్సిన బాధ్యత వైద్య సిబ్బందిపై ఉందన్నారు. ఆసుపత్రుల్లో మౌలిక సదుపాయాలు, మందుల లభ్యతపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ఎక్కడైనా సమస్యలు లేదా లోటుపాట్లు ఉంటే తన దృష్టికి తీసుకువస్తే వెంటనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ముఖ్యంగా మందుల కొరత లేకుండా చూడాలని వైద్యులను ఆదేశించారు. ప్రభుత్వం ప్రజారోగ్యానికి పెద్దపీట వేస్తున్న నేపథ్యంలో వైద్యులు, సిబ్బంది సేవాభావంతో పనిచేయాలని ఆయన ఆకాంక్షించారు. ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకునేలా ఆసుపత్రుల్లో సేవల ప్రమాణాలు మెరుగుపడాలని అన్నారు.

ఈ సమావేశంలో నియోజకవర్గ సమన్వయకర్త బగ్గు అర్చన, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ మునికోటి దాంబాబు, జలుమూరు నీటి సంఘం ఉపాధ్యక్షులు అక్కాజోస్యల దత్తు బాబు, యూనిట్ ఇన్‌చార్జి చల్ల షణ్ముఖరావు మాస్టర్, ఎంపీడీవో, హాస్పిటల్ కమిటీ సభ్యులు, వైద్యాధికారులు, సిబ్బంది, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.





## ప్రవీణకు ఉత్తమ అధికారిణి పురస్కారం




**నరసన్నపేట, ఫిబ్రవరి 5(వార్త):** బొరిగివలస గ్రామ సచివాలయంలో పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్న కే. ప్రవీణ ఉత్తమ అధికారిణిగా ఎంపికై పురస్కారం అందుకున్నారు. శ్రీకాకుళంలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో పంచాయతీరాజ్ కమిషనర్ ఎం. కృష్ణ తేజ ఆమెకు అవార్డును ప్రదానం చేశారు. ఇటీవల కాలంలో ఐ.వి.ఆర్.ఎస్. కాల్స్‌కు వేగవంతమైన పరిష్కారం చూపడంలో, గ్రామంలో పారిశుద్ధ్య నిర్వహణను మెరుగుపరచడంలో ప్రవీణ చేసిన కృషిని గుర్తించి ఈ పురస్కారం అందించినట్లు అధికారులు తెలిపారు. ప్రజలకు మరింత సమర్థవంతమైన సేవలు అందించాలనే లక్ష్యంతో నిరంతరం కృషి చేస్తానని ఈ సందర్భంగా ప్రవీణ తెలిపారు. ఈ అవార్డు తన బాధ్యతలను మరింత నిబద్ధతతో నిర్వహించేందుకు ప్రోత్సాహంగా నిలుస్తుందని ఆమె ఆనందం వ్యక్తం చేశారు.

## వందేమాతరం కోస్టల్ సైక్లోథాన్ యాత్రకు ఘన స్వాగతం




**నరసన్నపేట, ఫిబ్రవరి5 (వార్త):** కేంద్ర పారిశ్రామిక భద్రత దళం (సీఐఎస్ఎఫ్) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వందేమాతరం కోస్టల్ సైక్లోథాన్ యాత్రకు నరసన్నపేటలో ఘన స్వాగతం లభించింది. గురువారం నరసన్నపేట ఎస్ఐ గణేశ్ నాయకత్వంలో పలు కళాశాలల ఎన్సీసీ విద్యార్థులు ఈ సైకిల్ యాత్ర బృందాన్ని ఉత్సాహంగా స్వాగతించారు. ఈ సందర్భంగా డీఐజీ రాఘవేంద్ర కుమార్ మాట్లాడుతూ, వందేమాతరం గీతం 150 ఏళ్లు పూర్తి చేసిన సందర్భంగా దేశభక్తిని పెంపొందించడమే లక్ష్యంగా ఈ సైక్లోథాన్ యాత్రను చేపట్టినట్లు తెలిపారు. రాష్ట్రంలోని తొమ్మిది సముద్ర తీర ప్రాంతాల మీదుగా మొత్తం 6,500 కిలోమీటర్ల మేర ఈ యాత్ర కొనసాగుతుందని వివరించారు. దేశ ఐక్యత, జాతీయ గౌరవాన్ని చాటిచెప్పే ఈ యాత్ర యువతలో దేశ భక్తి భావనను మరింత బలపరిచేలా ఉంటుందని పలువురు అభిప్రాయపడ్డారు.

## పాఠశాలల్లో ఎంఈవోల ఆకస్మిక తనిఖీలు



**జలుమూరు, ఫిబ్రవరి 5(వార్త):** అచ్యుతాపురం, నగిరి కటకం, కొండ పోలవలస గ్రామాల్లో ఉన్న పాఠశాలలను ఎంఈవోలు మాధవరావు, ఎం.వి.ఆర్. ప్రసాదులు గురువారం ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా వారు విద్యార్థుల హాజరు పట్టికలు, వివిధ రికార్డులను జాగ్రత్తగా పరిశీలించారు. అలాగే ఎంఈఓ-2 ఎం.వి. ప్రసాద్ రావు శ్రీముఖలింగం పాఠశాల పరిసరాలను సందర్శించి, పాఠశాల ప్రాంగణం పరిశుభ్రంగా ఉండేలా అవసరమైన చర్యలు చేపట్టాలని సిబ్బందికి సూచించారు. విద్యార్థుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని మధ్యాహ్నం భోజన పథకంలో వేడి, నాణ్యమైన ఆహారాన్ని తప్పనిసరిగా అందించాలన్నారు. ఈ తనిఖీల ద్వారా పాఠశాలల నిర్వహణ మరింత మెరుగుపడాలని, విద్యార్థులకు మెరుగైన విద్యా వాతావరణం కల్పించాలని ఎంఈవోలు ఆశాభావం వ్యక్తం చేశారు.

## స్థలాల పరిశీలన



**సంతబొమ్మాళి, ఫిబ్రవరి 5(వార్త):** మూలపేట పోర్టు పరిసర ప్రాంతాల్లోని మర్రిపాడు, కాకరపల్లిలో స్థలాలను జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ గురువారం పరిశీలించారు. మర్రిపాడులో 400 ఎకరాలను కాకరపల్లిలో ఏపీఐఐసీ చెందిన స్థలాన్ని పరిశీలించారు. ఈ స్థలాల్లో పోర్టు అనుబంధ పరిశ్రమలు, టౌన్షిప్ కోసం సేకరణ చేస్తున్నట్లు తెలుస్తుంది. అనంతరం మూలపేట పోర్టును నౌపడలో ఆర్ అండ్ ఆర్ కాలనీని పరిశీ లించారు. ఆర్డీఓ కృష్ణమూర్తి, తాసిల్దార్ హేమ సుందర్రావు, ఆర్ఐ చంద్రమౌళి ఉన్నారు.

జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

## మత్స్య సంపద అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉంది : ఎమ్మెల్యే బగ్గు



**సారవకోట, ఫిబ్రవరి 5(వార్త):** మత్స్యకారుల జీవనాధారమైన మత్స్య సంపదను కాపాడుకోవడంతో పాటు దానిని మరింత అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి పేర్కొన్నారు. గురువారం సారవకోట మండలం బుడితి కోనేరులో చేప పిల్లలను విడిచిపెట్టిన అనంతరం నిర్వహించిన సభలో ఆయన మాట్లాడారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, మత్స్యకారుల సంక్షేమమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం నూటికి నూరు శాతం రాయితీతో చేప పిల్లలను అందిస్తోందని తెలిపారు. ఈ చర్యల ద్వారా మత్స్య సంపద పెరుగుదలతో పాటు మత్స్యకారుల ఆదాయం కూడా మెరుగుపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

కార్యక్రమంలో మత్స్య శాఖ అధికారులు, సిబ్బంది, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# ఈదుపురం ఉపాధ్యాయినికి జాతీయ పురస్కారం



**ఇచ్ఛాపురం, ఫిబ్రవరి 5(వార్త):** జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ పురస్కార నామినేషన్‌కు ఈదుపురం కాంద్ర వార్డు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రధానోపాధ్యాయిని బూరవిల్లి ఉమామహేశ్వరి జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారానికి నామినేట్ అయ్యి జిల్లాకే గర్వకారణంగా నిలిచారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వ విద్యాశాఖ ఆధీనంలోని ప్రతిష్ఠాత్మక సంస్థ నేషనల్ బుక్ ట్రస్ట్ న్యూఢిల్లీ ఆమె సేవలకు గుర్తింపుగా సుమారు రూ.10,000 విలువైన పుస్తకాలను బహుమతిగా అందజేసారు. విద్యారంగంలో విశిష్ట సేవలు అందించిన ఉపాధ్యాయులను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో, పాఠశాల విద్య, సాక్షరత విభాగం ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా రూపొందించిన జాబితాలో ఉన్న 154 మంది ఉపాధ్యాయులకు నేషనల్ బుక్ ట్రస్ట్ ఆఫ్ ఇండియా పుస్తకాలను పంపిణీ చేశారు. విద్యారంగంలో ఉపాధ్యాయులు చేసిన అసాధారణ సేవలకు ఒక చిన్న గుర్తుగా అందజేస్తున్నట్లు కేంద్ర ప్రభుత్వం పేర్కొంది. రాష్ట్ర, జాతీయ స్థాయిలో సైన్స్‌కు సంబంధించిన పలు అంశాలలో విద్యార్థులను ప్రోత్సహిస్తూ, శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించడంలో ఉమా మహేశ్వరి ఎంతో కృషి చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో మండల విద్యాశాఖ అధికారి అప్పారావు ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వం సరఫరా చేసిన పుస్తకాలను ఆవిష్కరించారు. అనంతరం ఆమెకి పాఠశాల ఉపాధ్యాయ సిబ్బంది ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎం ఈ ఓ మాట్లాడుతూ ముఖ్యంగా విద్యార్థులను పరిశోధనల వైపు మళ్లిస్తూ, దేశవ్యాప్తంగా నిర్వహించిన సారాభాయి టీచర్ సైంటిస్ట్ కార్యక్రమంలో పొందిన రెండో స్థానం ఆమె ప్రతిభకు కేంద్ర ప్రభుత్వ స్థాయి లో గుర్తింపు తీసుకొచ్చింది. విద్యార్థులను ప్రతిష్ఠాత్మక కార్యక్రమాల్లో జాతీయ స్థాయిలో ఎంపికయ్యే విధంగా మార్గనిర్దేశం చేస్తూ, దేశ రాజధాని న్యూఢిల్లీలో ఆమె పలు మార్లు విద్యార్థులతో కలిసి తమ ఆవిష్కరణలను ప్రదర్శించారని, ఇది గ్రామీణ ప్రాంత విద్యార్థులకు జాతీయ వేదికపై గుర్తింపు తెచ్చిన గొప్ప విషయంగా భావిస్తున్నట్లు అన్నారు.ఆమె ఒక సైన్స్ పాఠ్యపుస్తక రచయితగా, అలాగే దీక్ష వేదికలో ఈ-కంటెంట్ డెవలపర్‌గా కూడా సేవలందిస్తున్నారు. అనేక విభాగాల్లో రాష్ట్ర స్థాయిలో రిసోర్స్ పర్సన్‌గా పనిచేస్తూ, ఉపాధ్యాయ శిక్షణ మరియు బోధనా నాణ్యత అభివృద్ధిలో ఆమె విశేష సేవలు అందించారనీ ఆమె సేవలను కొనియాడారు.. ఈ కార్యక్రమం లో ఎం ఈ ఓ 2 విశ్వనాధం పాఠశాల ఉపాధ్యాయ సిబ్బంది భాస్కర్ పాడి, కృష్ణ చంద్ర పాడి, సబితా కుమారి, ఆనందరావు, ప్రశాంత్ లిమ్మయి తదితరులు పాల్గొన్నారు.

## ఎలమంచిలి జడ్పీ పాఠశాలకు ప్రింటర్ వితరణ



**జలుమూరు, ఫిబ్రవరి 5(వార్త):** ఎలమంచిలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు రూ.22 వేల విలువచేసే ప్రింటర్‌ను వితరణగా అందజేశారని హెడ్‌మాస్టర్ గొద్దు రఘునాథ్ తెలిపారు. గురువారం స్థానిక పంచాయతీ ఉపసర్పంచ్ కోర్ను జగ్గారావు పాఠశాలను సందర్శించి ఈ ప్రింటర్‌ను అధికారికంగా అప్పగించినట్లు ఆయన చెప్పారు. పదవ తరగతి విద్యార్థులకు విద్యాపరంగా ఉపయోగపడే విధంగా ఈ ప్రింటర్‌ను అందజేస్తున్నట్లు ఉపసర్పంచ్ పేర్కొన్నారని హెచ్‌ఎం వివరించారు. ఈ సందర్భంగా పాఠశాలకు వచ్చిన ఆయన ఉపాధ్యాయుల సమక్షంలో ప్రింటర్‌ను అందించారు. ఈ సహకారానికి ఉపాధ్యాయులు ఉపసర్పంచ్ కోర్ను జగ్గారావును అభినందించారు.

## 'స్వచ్ఛ భారత్' సామగ్రి పంపిణీ

### -43 పంచాయతీలకు ట్రై సైకిళ్లు, చెత్త బకెట్ల అందజేత



**కొత్తూరు, ఫిబ్రవరి 5(వార్త):** గ్రామాలను పరిశుభ్రంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ప్రభుత్వం స్వచ్ఛ భారత్ మిషన్ పథకానికి పెద్దపీట వేస్తోంది. ఇందులో భాగంగా కొత్తూరు మండలంలోని 43 గ్రామ పంచాయతీలకు అవసరమైన పారిశుద్ధ్య సామగ్రిని గురువారం అధికారికంగా పంపిణీ చేశారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో లోతుగెడ్డ తులసీ వరప్రసాద్ రావు ముఖ్య అతిథిగా పాల్గొని ట్రై సైకిళ్లను, చెత్త సేకరణ బకెట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా తులసీ వరప్రసాద్ రావు మాట్లాడుతూ, గ్రామాల్లో పారిశుద్ధ్యం మెరుగుపడాలంటే పారిశుద్ధ్య కార్మికులకు సరైన మౌలిక వసతులు కల్పించడం అత్యంత ఆవశ్యకమని పేర్కొన్నారు. "ప్రతి గ్రామాన్ని ఆరోగ్యవంతంగా, పరిశుభ్రంగా ఉంచడంలో పారిశుద్ధ్య కార్మికుల పాత్ర వెలకట్టలేనిది. వారికి అవసరమైన పరికరాలను అందించడం ద్వారా పనుల్లో మరింత వేగం, సౌలభ్యం పెరుగుతాయి," అని ఆయన వెల్లడించారు. స్వచ్ఛత కార్యక్రమాలను కేవలం ప్రభుత్వ కార్యక్రమంగా కాకుండా ఒక సామాజిక బాధ్యతగా చేపట్టాలని కోరారు. ప్రతి గ్రామాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దేందుకు ప్రజలు, ప్రజాప్రతినిధులు మరియు అధికారులు సమన్వయంతో సహకరించాలని ఆయన పిలుపునిచ్చారు.సామగ్రి అందుకున్న పంచాయతీ ప్రతినిధులు, ఇకపై పారిశుద్ధ్య నిర్వహణ మరింత మెరుగ్గా సాగుతుందని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కొత్తూరు మండల ఇన్-ఛార్జ్ ఎంపీడీవో, డిప్యూటీ ఎంపీడీవోలతో పాటు కూటమి నాయకులు, వివిధ గ్రామాలకు చెందిన ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

## జీడి మామిడి రక్షణపై అప్రమత్తంగా ఉండాలి



**సోంపేట, ఫిబ్రవరి 5(వార్త):** జీడి మామిడి పూత దశ చాలా కీలకమైనదని ఇటువంటి సమయంలో పూతకు ఆశించే టీ దోమ నివారణ పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలని మండల ఉద్యాన శాఖ అధికారిని పి మాధవి కోరారు. పూత పిందె దశలో నిర్లక్ష్యంతో జీడి, మామిడి దిగుబడిపై ప్రభావం ఏర్పడి రైతులకు నష్టం కలుగుతుందని పేర్కొన్నారు. ఈ మండలం తోట వూరు, సిరి మామిడి, మామిడిపల్లి గ్రామాల్లో గురువారం ఉద్యాన శాఖ అధికారి పర్యటించి రైతులకు పంటల సంరక్షణపై అవగాహన కల్పించారు. జీడి మామిడి పూత పిందె పై టీ దోమ ఆశించి రసాన్ని పీల్చుతుందని అన్నారు. దీనివల్ల పోత మాడిపోయి నల్లగా మారి దిగుబడి బాగా తగ్గుతుందని వివరించారు. దీని నివారణకు పూత దశలో లాండా సైహ లోతిన్ మందును 0.6 మి.లీ. ఒక లీటరు నీటిలో కలిపి పిచికారి చేయాలని సూచించారు. లేదా క్లోరి ఫైరిఫాస్ అనే మందును లీటరు నీటికి 2 మి.లీ కలిపి పిచికారి చేయాలని సూచించారు. జీడిమామిడి పిండి తొడిగే దశలో పిందె బఠానీ గింజ సైజులో ఉన్నప్పుడు ప్రోఫెనో పాస్ 1 మి.లీ ఒక లీటర్ నీటిలో కలిపి పది నుండి 25 రోజుల వ్యవధిలో పురుగు ఉధృతిని బట్టి పిచికారి చేయాలని సూచించారు. కొబ్బరిని ఆశిస్తున్న పురుగులు తెగుళ్ల నివారణ గూర్చి రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో విఏఏ గణేష్, విహెచ్ఎ సోమేశ్వరి, స్థానిక పెద్దలు సూరాడ చంద్రమోహన్, రైతులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు కళ్లజోళ్ల పంపిణీ

**జలుమూరు, ఫిబ్రవరి 5(వార్త):** జలుమూరు ఆదర్శ మోడల్ ప్రాథమిక పాఠశాలలో గురువారం దృష్టి లోపం ఉన్న విద్యార్థులకు కళ్లజోళ్లను పంపిణీ చేశారు. వైద్యశాఖ ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన నేత్ర పరీక్షల సందర్భంగా కొంతమంది విద్యార్థులకు చూపు సమస్యలు ఉన్నట్లు గుర్తించడంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. వైద్య శాఖ అందించిన కళ్లజోళ్లను అర్హులైన విద్యార్థులకు పంపిణీ చేసినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు మాధవరావు, ఉపాధ్యాయుడు మెండ రామారావు తెలిపారు. దృష్టి లోపం కారణంగా చదువులో ఇబ్బందులు ఎదుర్కొంటున్న విద్యార్థులకు కళ్లజోళ్లు ఎంతో ఉపయోగకరంగా ఉండి, వారి విద్యాభివృద్ధికి దోహదపడతాయని వారు పేర్కొన్నారు. ప్రభుత్వం చేపడుతున్న ఆరోగ్య, విద్యా సంక్షేమ కార్యక్రమాల వల్ల గ్రామీణ ప్రాంతాల్లోని విద్యార్థులు ప్రయోజనం పొందుతున్నారని ఈ సందర్భంగా ఉపాధ్యాయులు అభిప్రాయపడ్డారు.



## అప్పలసూర్యనారాయణ జీవితం స్ఫూర్తిదాయకం

### -ఆయన వారసులు రాజకీయాల్లోకి రావాలి

### - తెలుగు శక్తి అధ్యక్షుడు బి.వి.రామ్



**శ్రీకాకుళం, ఫిబ్రవరి 5(వార్త):** తెలుగు దేశం పార్టీ సీనియర్ నాయకులు గుండ అప్పల సూర్యనారాయణ గారి మృతి తనను ఎంతో బాధించిందని తెలుగు శక్తి అధినేత బి.వి.రామ్ అన్నారు. ఆయన మృతి చెందిన విషయం తెలుసుకొని గురువారం సాయంత్రం అరిసవెల్లి శ్రీకాకుళంలో వారి ఇంటికి వెళ్లి వారి సతీమణి, కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ తెలుగు శక్తి కార్యక్రమాల్లో, సమావేశంలో ఆయన నిత్యం తనతో పాటు పాల్గొని మమ్మల్ని ఎంతో ప్రోత్సహించే వారని బి.వి.రామ్ అన్నారు. నీ అంత ధైర్యవంతుడు ఎవరూ లేరని అప్పలసూర్యనారాయణ గారు ఎప్పుడు చెప్పే వారిని గుర్తు చేసుకున్నారు. ఆయన మహానుభావుడు, నిగర్వి, ఎవరినైనా చిరునవ్వుతో పలకరించే అప్పల సూర్యనారాయణ మా మధ్య లేకపోవడం జీర్ణించుకోలేకపోతున్నాం. ఆయన స్వర్గస్తులు కావడం నిజంగా బాధాకరం. స్వర్గీయ ఎన్టీ రామారావు క్యాబినెట్లో తొలిసారిగా మంత్రి పదవిలోకి తీసుకున్నారు. ఆయన అనుభవాలు రాజకీయ భవిష్యత్తు తరాలకు తెలియాలి. ఆయన తరపున వారసులు రాజకీయాల్లోకి రావాలని సిఎం చంద్రబాబు నాయుడు వారి వారసులను ప్రోత్సహించి రాజకీయాల్లోకి తీసుకురావాలని కోరారు. ఆయన భావాలు, ఆశయాలు ప్రజల్లోకి తీసుకెళ్తామని జోహార్లు అర్పించారు.



## రాజకీయ నాయకులు హుందాగా వ్యవహరించాలి

### -బీసీ వెల్ఫేర్ రాష్ట్ర ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ దాసరి తాతారావు



**మందస, ఫిబ్రవరి 5(వార్త):** రాజకీయాల్లో నాయకులు హుందాగా వ్యవహరించాలని బీసీ వెల్ఫేర్ రాష్ట్ర ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ దాసరి తాతారావుయాదవ్ అన్నారు. మందస మండలంలోని హరిపురంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ మాజీ మంత్రి డాక్టర్ అప్పలరాజు చదివిన చదువుకు మాట్లాడే మాటలకి సంబంధమేమైనా ఉందా? అని ప్రశ్నించారు. పలాస నియోజకవర్గ శాసనసభ్యురాలు గౌతు శిరీషను ఉద్దేశించి మీరు మాట్లాడుతున్న పరుష పదజాలం విని, సభ్యసమాజం తలదించుకుంటోందన్నారు. గతంలో మీ తండ్రి వయసున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుపై, నారా లోకేష్ పైన అవమానకర రీతిలో మీరు మాట్లాడిన తీరు చూసి.. మీ పార్టీ నాయకులే మిమ్మల్ని ఛీత్కరించిన విషయం మీకు తెలియదేమోనన్నారు. చదువది ఎంత గల్గిన రసజ్ఞత ఇంచుక చాలకున్న ఆ చదువు నిరర్థకంబు, గుణసంయుతులెవ్వరూ మెచ్చరెచ్చట! ఎంత చదువు చదివినా ఇంగిత జ్ఞానం లేకుండా మాట్లాడేవాడు సంస్కారహీనుడని.. బాగా చదువుకున్న వారు కదా ఈ పద్యాన్ని ఒకసారి గుర్తు చేస్తున్నానన్నారు. మీరు వాడిన నీ మొగుడు అనే పదం మీ ఇంట్లో వాళ్ళకి ఎవరైనా అంటే ఆ బాధేంటో మీకు తెలుస్తుందని, గౌతు శిరీష ఒక మహిళా శాసనసభ్యురాలని కనీసం చూడకుండా మీరు వాడుతున్న భాష సోషల్ మీడియాలో మీ అనుచరులు చేస్తున్న వెకిలి చేష్టలు పలాస ప్రజల ప్రతిష్టని దిగజారుస్తున్నాయన్నారు. ఎందుకంటే ఇక్కడ ప్రజలు రాజకీయ పార్టీలకు అతీతమైన సంస్కారవంతులని, ఆమె తాత స్వర్గీయ సర్దార్ గౌతు లచ్చన్న మనలాంటి బలహీన వర్గాలు సమాజంలో తలెత్తుకొని బ్రతికేందుకు దోహదం చేసిన గొప్ప పోరాటయోధులన్నారు. ఆమె తండ్రి గౌతు శ్యామసుందర్ శివాజీ ప్రత్యర్థి పార్టీల నాయకులు సైతం చేతులెత్తి నమస్కరించే గొప్ప వ్యక్తిత్వం గలవారన్నారు. అలాంటి కుటుంబంపై ఇంకా మీరు మంత్రిననే భ్రమలో ఉండి మాట్లాడుతున్నారో లేక మీ అధినాయకుడి కళ్ళల్లో ఆనందం కోసం మాట్లాడుతున్నారో విజ్ఞత హుందాతనం లేని వ్యక్తిగత విమర్శలు చేసి సమాజంలో వర్గ వైషమ్యాలు సృష్టించడం సమాజహితానికి మంచిది కాదన్నారు. పలాస ప్రజలు అన్నీ గమనిస్తున్నారని, దీని పర్యవసానం భవిష్యత్తులో మరో పరాభవానికి సంకేతంగా నిలుస్తుందన్నారు.

# అధ్వానంగా జెమ్స్ అవుట్ గేట్ రోడ్డు

### -వాహనదారులు, రోగులకు ఇబ్బందులు - ప్రమాదాల పాలవుతున్న వైనం

### -యాజమాన్యం పట్టించుకోవాలని పలువురి విజ్ఞప్తి



**శ్రీకాకుళం, ఫిబ్రవరి 5(వార్త):** రాగోలులోని జెమ్స్ హాస్పిటల్ నందు అవుట్ గేట్ బీటీ రోడ్ జంక్షన్ రోడ్డు.. పూర్తిగా రాళ్లు..కంకరతో అసంపూర్ణంగా ఉండి వాహన దారులకు తీవ్రంగా ఇబ్బందులు పాల్జేస్తోంది. తీవ్రంగా ధూళితో తాము తీవ్ర ఇబ్బంది లకు గురవుతున్నామని ఇటు రోగులు, వారి బంధువులు, వాహనదారులు వాపోతున్నా రు. కొంతమంది గాయాల పాలయ్యారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ఆస్పత్రి యాజమాన్యం చర్యలు తీసుకుని రోడ్డును బాగు చేయాలని వారు కోరుతున్నారు

## మధ్యాహ్న భోజన పథకం తనిఖీ



**జలుమూరు, ఫిబ్రవరి 5(వార్త):** శ్రీముఖలింగం ప్రభుత్వ పాఠశాలలో అమలవుతున్న డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని ఎంఈఓ--2 ఎంవీఆర్ఎస్ ప్రసాదరావు గురువారం ఆకస్మికంగా పరిశీలించారు. భోజన సమయానికి పాఠశాలకు చేరుకున్న ఆయన, ప్రభుత్వం నిర్దేశించిన మెనూ సక్రమంగా అమలవుతోందో లేదో వంట ఏజెన్సీ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. వంట తయారీ సమయంలో తప్పనిసరిగా ఉపాధ్యాయులకు ముందుగా సమాచారం ఇవ్వాలని ఆయన ఆదేశించారు. అలాగే మధ్యాహ్న భోజన పథకాన్ని ఉపాధ్యాయులు నిరంతరం పర్యవేక్షిస్తూ నాణ్యత, పరిశుభ్రతపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. విద్యార్థులకు ఆరోగ్యకరమైన, పోషకాహారం అందేలా అందరూ సమన్వయంతో పనిచేయాలని ఎంఈఓ తెలిపారు.

## కోస్తా కారిడార్‌లో టూరిజం విస్తరణకు వినతి




**నరసన్నపేట, ఫిబ్రవరి 5(వార్త):** నరసన్నపేట నుంచి ఇచ్ఛాపురం వరకు విస్తరించిన కోస్తా కారిడార్‌ను పర్యాటక హబ్‌గా అభివృద్ధి చేయాలని రాష్ట్ర కాళింగ సంక్షేమ కార్పొరేషన్ అధ్యక్షుడు రోణంకి కృష్ణం నాయుడు కోరారు. ఈ మేరకు గురువారం ఢిల్లీలో కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడును కలుసుకుని వినతి పత్రాన్ని సమర్పించారు. కోస్తా ప్రాంతంలోని ప్రకృతి సౌందర్యం, సముద్ర తీరాలు, సాంస్కృతిక విశేషాలను పర్యాటకంగా అభివృద్ధి చేస్తే జిల్లాకు ఆర్థికంగా మేలు జరుగుతుందని ఆయన వివరించారు. ముఖ్యంగా టూరిజం రంగంలో స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు కల్పించే విధంగా ప్రత్యేక ప్రణాళికలు అమలు చేయాలని సూచించారు. ఈ ప్రతిపాదనపై కేంద్రమంత్రి సానుకూలంగా స్పందిస్తూ, సంబంధిత శాఖలతో చర్చించి అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు తెలిసింది. జిల్లాలో టూరిజం అభివృద్ధి ద్వారా ఉపాధి, మౌలిక వసతుల పెంపు సాధ్యమవుతుందని స్థానికులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

## కర్రసాము పోటీల్లో జిల్లా ద్వితీయ స్థానం సాధించిన పీఎం శ్రీ పాఠశాల విద్యార్థి

**నరసన్నపేట, ఫిబ్రవరి 5(వార్త):** జిల్లా కేంద్రంలో రథసప్తమి సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాల్లో కర్రసాము పోటీల్లో ప్రతిభ చూపిన నరసన్నపేట పీఎం శ్రీ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఏడవ తరగతి విద్యార్థి పి. సాయి జిల్లా ద్వితీయ స్థానాన్ని సాధించారు. ఈ సందర్భంగా గురువారం పాఠశాల ఆవరణలో జరిగిన కార్యక్రమంలో హెడ్‌మాస్టర్ పైడి వెంకట్రావు విద్యార్థికి మెమొంటోతో పాటు నగదు బహుమతిని అందజేశారు. విద్యార్థి చూపిన ప్రతిభకు నిర్వాహకులు ఈ అవార్డు ప్రదానం చేసినట్లు హెచ్‌ఎం తెలిపారు. ఈ విజయం పాఠశాలకు గర్వకారణమని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు విద్యార్థిని అభినందించి, భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.



## ఆదిత్యుని సన్నిధిలో పంచాయతీరాజ్ కమిషనర్ కృష్ణతేజ

**అరసవల్లి, ఫిబ్రవరి 5(వార్త):** ప్రత్యక్ష దైవం సూర్యనారాయణ స్వామిని గురువారం ఉదయం రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ వి.ఆర్.కృష్ణతేజ మైలవరపు దర్శించుకున్నారు. ఆలయానికి విచ్చేసిన ఆయనకు ఆలయ ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకర శర్మ సాదరంగా స్వాగతం పలికారు. ముందుగా స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించిన కమిషనర్‌కు, ఆలయ వేద పండితులు వేద మంత్రోచ్చారణలతో ఆశీర్వచనాలు అందజేశారు. అనంతరం ఆలయ అధికారులు స్వామివారి శేషవస్త్రం, తీర్థప్రసాదాలతో పాటు స్వామివారి చిత్రపటాన్ని వారికి బహుకరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.



## వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా
# పోలీసు సేవలు సులభతరం

* పరిపాలన అంశాలు ఈ-ఆఫీస్ ద్వారానే జరగాలి * పీజీఆర్ఎస్ ఫిర్యాదులు సకాలంలో, పారదర్శకంగా పరిష్కరించాలి
* జిల్లా ఎస్పీ కె.వి. మహేశ్వర రెడ్డి



**శ్రీకాకుళం, ఫిబ్రవరి 5(వార్త):** డిజిటల్ పాలనలో భాగంగా ప్రజలకు ప్రభుత్వ సేవలు మరింత సులభంగా, వేగవంతంగా పారదర్శకంగా అందించాలనే లక్ష్యంతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన మనమిత్ర (వాట్సాప్ గవర్నెన్స్) సేవలను ప్రజలు విస్తృతంగా వినియోగించుకోవాలని జిల్లా ఎస్పీ కె.వి.మహేశ్వర రెడ్డి తెలిపారు. గురువారం జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లా వ్యాప్తంగా ఉన్న డీఎస్పీలు, సీఐలతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో పీజీఆర్ఎస్, ఈ-ఆఫీస్, మనమిత్ర (వాట్సాప్ గవర్నెన్స్), ఈ-సాక్ష్య తదితర పరిపాలనా అంశాలపై జిల్లా ఎస్పీ విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ, పరిపాలనకు సంబంధించిన అన్ని పనులు తప్పనిసరిగా ఈ-ఆఫీస్ విధానంలోనే నిర్వహించాలన్నారు. పీజీఆర్ఎస్(పబ్లిక్ గ్రీవెన్స్) ద్వారా స్వీకరించే ప్రజా ఫిర్యాదులను సకాలంలో, పారదర్శకంగా పరిష్కరించే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. డిజిటల్ సాంకేతికతను వినియోగించి ప్రజలకు ప్రభుత్వ సేవలు ఇంటివద్ద నుంచే అందించాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం వాట్సాప్ గవర్నెన్స్ సేవలను అందుబాటులోకి తీసుకువచ్చిందన్నారు. ఈ సేవల ద్వారా ప్రజలు పోలీస్ స్టేషన్లకు వెళ్లకుండానే సులభంగా పోలీసు సేవలను పొందవచ్చని తెలిపారు. ఈ విధానంపై క్షేత్రస్థాయిలో ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. ప్రజలు పెండింగ్ ఈ-చలాన్ వివరాలు, చెల్లింపు ప్రక్రియలను కూడా మనమిత్ర (వాట్సాప్ గవర్నెన్స్) ద్వారా సులభంగా తెలుసుకోవచ్చున్నారు. ఈ సమీక్ష సమావేశంలో అదనపు ఎస్పీ కె.వి. రమణ, డీఎస్పీలు వివేకానంద, షేక్ సాహబాజ్ అహ్మద్, ఏవో గోపినాథ్, జిల్లా వ్యాప్తంగా ఉన్న సీఐలు ప్రత్యక్షంగా పాల్గొనగా, ఎస్సైలు జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా పాల్గొన్నారు.

## గోపినగరంలో ఏకీకృత కుటుంబ సర్వే



**ఆమదాలవలస, ఫిబ్రవరి 5 (వార్త):** మండలంలోని అక్కివరం పంచాయతీ గోపినగరంలో పంచాయతీ కార్యదర్శి హిమబింధు ఏకీకృత కుటుంబ సర్వే (యూఎఫ్ఎస్) సర్వే నిర్వహించారు. ప్రతి కుటుంబం నుండి ఆర్థిక, సామాజిక, విద్యా సంబంధిత, ఉపాధి వివరాలతో పాటు పలు కీలక సమాచారాలను నమోదు చేశారు. ఆధార్ నెంబర్, మొబైల్ నెంబర్, ఆదాయం, ఆస్తులు, ఇళ్ళ వివరాలు, సామాజిక మ్యాపింగ్ వంటి డేటాను సేకరించారు.

## పోటాపోటీగా పోలీసు క్రీడలు

**శ్రీకాకుళం, ఫిబ్రవరి5 (వార్త):** శ్రీకాకుళం జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వార్షిక పోలీసు స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్-2025 కార్యక్రమంలో భాగంగా రెండవ రోజు గురువారం వివిధ క్రీడా పోటీలు ఉత్సాహభరితంగా సాగాయి. బాడ్మింటన్ షటిల్ పోటీలు సింగిల్స్, డబుల్స్ విభాగాలలో నిర్వహించారు. క్రీడాకారులు పోటాపోటీగా తలపడ్డారు.

## బ్యాంకు మేనేజర్లతో పలాస సివిల్ జడ్జి సమావేశం

**పలాస, ఫిబ్రవరి 5 (వార్త):** పలాస కోర్టు ఆవరణలో న్యాయమూర్తి పలాస అధ్యక్షులు, మండల న్యాయ సేవా సంఘం, సివిల్ జడ్జ్ జూనియర్ డివిజన్ యు. మాధురి పలాసలోగల వివిధ బ్యాంకు మేనేజర్స్‌తో సమావేశం గురువారం నిర్వహించారు. మార్చి 14న జరగబోయే జాతీయ లోక్ అదాలత్‌లో, పెండింగ్లో గల బ్యాంకులకు సంబంధించిన కేసులను, ప్రీలిటిగేషన్ కేసులను ఎక్కువ సంఖ్యలో రాజీ చేసే విధంగా ప్రయత్నం చేయాలని తెలిపారు. కార్యక్రమంలో స్టేట్ బ్యాంక్ మెయిన్ బ్రాంచ్ చీఫ్ మేనేజర్ అర్జున్ రావు, ఇండియన్ బ్యాంక్ మేనేజర్ సహాబుద్దీన్, బ్యాంక్ ఆఫ్ బరోడా మేనేజర్ చంద్రశేఖర్, గ్రామీణ బ్యాంక్ మేనేజర్, బ్యాంకుల స్టాండింగ్ కౌన్సిల్ కె.రజిని కుమార్, సీనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

## నిరక్షరాస్యత నిర్మూలనకు కృషి



**జి.సిగడాం,జనవరి5(వార్త):** రాష్ట్రంలో నిరక్షరాస్యత నిర్మూలనకు ప్రభుత్వం కృషి చేస్తున్నదని ఎంపీడీవో జి.రామకృష్ణారావు అన్నారు. సోమవారం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో వెల్ఫేర్ అసిస్టెంట్‌లతో సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలని మొదటిగా విద్య యొక్క ప్రాముఖ్యతను ప్రజలకు తెలియజేయాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో, వెనుకబడిన వర్గాల్లో విద్య పట్ల ఆసక్తిని పెంచడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతున్నాయని తెలిపారు. గ్రామాల్లో నిరక్షరాస్యులైన వారు అక్షరాస్యులు వచ్చిన ప్రతిభావంతులకు బహుమతులను అందజేస్తుందన్నారు. ఈ సమావేశంలో ఎంఈవో అరసాడ రవి కుమార్, ఎపీఎం రెడ్డి రామకృష్ణారావు, ఈసీ గేదేల పురుషోత్తం, ట్రైనర్ వావిలపల్లి మనోజ్ తదితరులు ఉన్నారు.

## పారిశుద్ధ్య కార్మికులు విధులను
# సక్రమంగా నిర్వర్తించాలి

* జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్
* ఈ-ఆటోలను ప్రారంభించిన జిల్లా కలెక్టర్



**శ్రీకాకుళం, ఫిబ్రవరి 5(వార్త):** స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ ద్వారా పంపిణీ జరిగిన ఎనిమిది ఎలక్ట్రానిక్ వాహనాలను జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ జెండా ఊపి లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పరిశుభ్రతను పాటించాలని, ప్రభుత్వ కార్యక్రమాల్లో ప్రధానమైన పారిశుభ్రతపై అధికారులు మరియు సిబ్బంది బాధ్యత వహించి పనిచేయాలని సూచించారు. ఈ సందర్భంగా జిల్లా పంచాయతీ అధికారి భారతి సౌజన్యను ఏ ఏ మండలాలకు వాహనాలను కేటాయించారని వివరాలు అడిగి తెలుసుకున్నారు. కవిటి మండలం రాజపురం పంచాయతీ, కంచిలి మండలం ఎమ్ .యు.స్. పల్లి, ఇచ్ఛాపురం మండలం మసకాపురం, వజ్రపు కొత్తూరు మండలం పల్లిఊరు, మందస మండలం బుడారిసింగి, పలాస మండలం తర్లకోటకు ఒక్కొక్కటి చొప్పున మరియు కోటబొమ్మాళి మండలం నిమ్మాడకు రెండు వాహనాలను కలిపి మొత్తం ఎనిమిది వాహనాలను మంజూరు అయినట్లు కలెక్టరుకు ఆమె వివరించారు. తదుపరి వాహనాల పరిశుభ్రతను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని, అనుభవం ఉన్న డ్రైవర్లతో పని చేయించాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిపిఓ భారతి సౌజన్య, కార్యాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## అక్షరాస్యత కేంద్రంలో కలెక్టర్ తనిఖీ

మండలంలోని ఫాజిల్ బాగ్ పేటలో నిర్వహిస్తున్న 'అక్షర ఆంధ్ర – ఉల్లాస్' అక్షరాస్యత కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ సందర్శించారు. ఈ సందర్భంగా అభ్యాసకుల అభ్యసన సామర్థ్యాలను ఆయన స్వయంగా పరిశీలించారు. వాలంటీర్ టీచర్లు బోధిస్తున్న తీరును, అభ్యాసకులు అక్షరాలు రాస్తున్న విధానాన్ని గమనించి పలు సూచనలు చేశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. డిజిటల్ పద్ధతిలో బోధన సాగాలని, ఇందుకోసం టీసీఎస్ వీడియో పాఠాలను ప్రదర్శించాలని ఆదేశించారు. మార్చి 29న నిర్వహించనున్న పరీక్షకు అభ్యాసకులందరూ హాజరై, అక్షరాస్యులుగా ఉత్తీర్ణత సాధించాలని కోరారు.

# ఫుట్ పాత్ వ్యాపారులపై టీడీపీ నేత దౌర్జన్యం

* ఎమ్మెల్యే శిరీష ఆగ్రహంతో వెనుదిరిగిన నేత



**పలాస, ఫిబ్రవరి 5 (వార్త):** కాశీబుగ్గ నడిబొడ్డులో ముస్లిం క్రిస్టియన్ల స్మశాన వాటిక సమీపంలో దశాబ్దాల కాలంగా చిరు వ్యాపారులు తమ జీవనోపాధి పొందుతున్నారు. అక్కడ వ్యాపారాలు సాగిస్తున్న వ్యక్తులు కొన్నేళ్లుగా మున్సిపాలిటీకి అద్దె రూపంగా చలానా చెల్లిస్తున్నారు. వీరికి మున్సిపాలిటీ తాత్కాలిక అథారిటీ కూడా ఉంది. ఈ నేపథ్యంలో తెలుగుదేశం పార్టీకి చెందిన చిన్న బడం గ్రామానికి గల వ్యక్తి బోసు బాబు సంబంధిత వ్యాపారులను తన వద్దకు రప్పించుకొని ప్రతి నెల తనకు అద్దె చెల్లించాలని, లేనిపక్షంలో ఫుట్‌పాత్‌లపై షాపులు ఎత్తివేయాలని గురువారం ఆదేశించాడు. ఈ సందర్భంగా వారి మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. దీంతో వ్యాపారులు తమ కుటుంబాలతో కలిసి టీడీపీకి చెందిన నేత కారు ముందు బైఠాయించారు. ఆయనకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే శిరీష.. బోసుబాబుపై ఆగ్రహం వ్యక్తం చేయడంతో పాటు వ్యాపారులకు హామీ ఇచ్చారు. దీంతో వారంతా ఆందోళనను విరమించారు. ఈ ఆందోళన కార్యక్రమంలో లోకనాథం మేనకేశ్వరరావు, పోలాకి రాజు, అన్నపూర్ణమ్మ, రమాదేవి, శిరీష, లక్ష్మి, దివ్య, తోని బెహరా, సయ్యద్ అహ్మద్ అలీ, హరికృష్ణ బెహరా, బి సునీల్ తదితరులు ఉన్నారు.

## గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేయడం దుర్మార్గం

* సీపీఎం నాయకులు * కొత్తూరు ఎంపీడీవో కార్యాలయం వద్ద భారీ ధర్నా

**కొత్తూరు, ఫిబ్రవరి 5 (వార్త):** మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టంను యథాతథంగా కొనసాగించాలని, కేంద్రంలోని మోదీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన చట్టాన్ని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ సీపీఎం ఆధ్వర్యంలో గురువారం కొత్తూరు మండల ఎంపీడీవో కార్యాలయం ఎదుట భారీ ధర్నా నిర్వహించారు. అనంతరం ఎంపీడీవో బి. రాంబాబుకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు సిర్ల ప్రసాద్, సీఐటీయూ కన్వీనర్ పనస రమేష్ మాట్లాడుతూ, యూపీఏ-1 ప్రభుత్వ హయాంలో వామపక్షాల ఒత్తిడితో గ్రామీణ పేదలు, కూలీల సంక్షేమం కోసం తెచ్చిన ఉపాధి హామీ చట్టాన్ని కేంద్ర ప్రభుత్వం నిర్వీర్యం చేస్తోందని మండిపడ్డారు. బడా కార్పొరేట్ సంస్థలకు చౌకగా శ్రమశక్తిని అందించేందుకే కేంద్రం కొత్త చట్టాన్ని తెచ్చిందని విమర్శించారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి కరువైతే, కూలీలు పట్టణాలకు వలస వెళ్లి తక్కువ వేతనాలకు పని చేస్తారన్నదే కార్పొరేట్ల దురాలోచన అని ధ్వజమెత్తారు. 2021లో ఈ పథకానికి రూ. 1.11 లక్షల కోట్లు కేటాయించగా, ప్రస్తుత బడ్జెట్‌లో దాన్ని రూ. 86 వేల కోట్లకు తగ్గించడం దారుణమన్నారు. పేదల పొట్ట కొట్టి, కార్పొరేట్ల అప్పులు రద్దు చేయడం మోదీ ప్రభుత్వ నైజమని విమర్శించారు. పాత చట్టం ప్రకారం కేంద్రం 90 శాతం నిధులు ఇచ్చేదని, కొత్త చట్టంలో కేంద్రం వాటాను 60శాతానికి తగ్గించి, రాష్ట్రాల వాటాను 40 శాతానికి పెంచడం ద్వారా ఈ పథకాన్ని క్రమంగా ఎత్తివేసే కుట్ర జరుగుతోందని ఆరోపించారు. ఈ ప్రజా వ్యతిరేక చట్టాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఆమోదించడం సిగ్గుచేటని, బీజేపీ చర్యలకు టీడీపీ, జనసేన మద్దతు తెలపడం దుర్మార్గమని విమర్శించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు బసవల వసంతరావు, నిమ్మక అప్పన్న, సుంకన్న, జయరాజు, లత, సింహాచలం, రాజు, వ్యవసాయ కార్మికులు పాల్గొన్నారు.




## ఆర్టీసీ ఉద్యోగులకు దువ్వాడ ఆర్థికసాయం

**పలాస, ఫిబ్రవరి 5 (వార్త):** ఏపీఎస్ ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ 28వ రాష్ట్ర మహాసభ ఏప్రిల్ నెలలో ఒంగోలులో నిర్వహించనున్న నేపథ్యంలో, మహాసభ విజయవంతం కోసం యూనియన్ సభ్యులకు ఆర్థిక సహకారంగా రూ.10వేలును ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ గౌరవ అధ్యక్షులు దువ్వాడ శ్రీధర్ బాబా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికుల హక్కుల పరిరక్షణే యూనియన్ ప్రధాన లక్ష్యమని, ఉద్యోగుల ఐక్యతతోనే సంస్థ అభివృద్ధి సాధ్యమని పేర్కొన్నారు. రాష్ట్ర మహాసభను ఘనంగా నిర్వహించి ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు, సభ్యులు పాల్గొన్నారు.

## విద్యార్థుల్లో దేశభక్తి పెంపొందించాలి

**పలాస, ఫిబ్రవరి 5 (వార్త):** విద్యార్థుల్లో దేశభక్తి పెంపొందించాలని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. గురువారం జాతీయ గీతం వందేమాతరం 150 సంవత్సరాలు పూర్తి అయిన సందర్భంగా సిఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో 9 రాష్ట్రాల్లో కలకత్తా నుండి కేరళ వరకు 6500 కిమీ సైకిల్ ర్యాలీ నిర్వహిస్తున్న కాస్ట్రాల్ సైక్లోథోన్ కార్యక్రమానికి పలాస ప్రభుత్వ పాఠశాలలో వారికి పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష ఘన స్వాగతం పలికి అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు దేశభక్తి అలవర్చుకోవాలని, వందేమాతరం గీతం ప్రాముఖ్యత, అవశ్యకత అందరికి తెలియజేయాలని, సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన కాస్ట్రాల్ సైక్లోథోన్ కార్యక్రమంలో పాల్గొనడం ఆనందంగా ఉందని అన్నారు. చదువుతో పాటు దేశభక్తి విద్యార్థులు పెంపొందించుకోవాలని విజ్ఞప్తి చేశారు, ఈ సందర్భంగా ర్యాలీ చేస్తున్న సిబ్బందికి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సిఐఎస్ఎఫ్ డిగ్ కామెండెంట్, సిబ్బంది, కూటమి నాయకులు, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## బుద్ధుని జీవితం ప్రతి విద్యార్థికి ఒక పాఠం

* కళాశాల అధ్యాపకులు
* ఘనంగా బుద్ధ విగ్రహం మూడవ వార్షికోత్సవం

**కొత్తూరు, జనవరి 5 (వార్త):** కొత్తూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణంలో ప్రతిష్ఠించిన బుద్ధుని విగ్రహ మూడవ వార్షికోత్సవాన్ని గురువారం అత్యంత వైభవంగా నిర్వహించారు. 1989-90 విద్యా సంవత్సరానికి చెందిన 10వ తరగతి పూర్వ విద్యార్థుల చొరవతో మూడేళ్ల క్రితం ఈ విగ్రహాన్ని ఇక్కడ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా ముందుగా బుద్ధుని విగ్రహానికి పూర్వ విద్యార్థులు, కళాశాల సిబ్బంది పూలమాలలు వేశారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు మాట్లాడుతూ.. తాము చదువుకున్న విద్యాసంస్థపై గౌరవంతో, సమాజానికి శాంతి, అహింస, సమానత్వ సందేశాన్ని అందించాలనే ఉద్దేశంతోనే ఈ విగ్రహాన్ని ఏర్పాటు చేశామని తెలిపారు. ప్రతి ఏటా ఈ వార్షికోత్సవం ద్వారా బుద్ధుని మార్గదర్శకాలను విద్యార్థులకు చేరువ చేస్తున్నట్లు వివరించారు. కళాశాల అధ్యాపకులు మాట్లాడుతూ.. ప్రభుత్వ విద్యాసంస్థల పట్ల పూర్వ విద్యార్థులు చూపుతున్న అనుబంధం అభినందనీయమన్నారు. కేవలం విద్యనే కాకుండా, విద్యార్థుల్లో నైతిక విలువలను పెంపొందించడానికి ఇలాంటి ఆధ్యాత్మిక, సామాజిక కార్యక్రమాలు దోహదపడతాయని పేర్కొన్నారు. బుద్ధుని జీవితం ప్రతి విద్యార్థికి ఒక పాఠమని, ఆయన చూపిన అహింసా మార్గం ప్రపంచశాంతికి ఏకైక మార్గమని అభిప్రాయపడ్డారు. ఈ వేడుకలో 1989-90 బ్యాచ్ పూర్వ విద్యార్థులు, కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపక బృందం, ప్రస్తుత విద్యార్థులు, స్థానిక ప్రముఖులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# ప్రజా సేవకే మా ప్రాధాన్యత

* పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష




**పలాస, ఫిబ్రవరి 5 (వార్త):** కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజా సంక్షేమ కార్యక్రమాలలో అనవసర ప్రచార ఆర్భాటాలకు స్వస్తి పలికి, నిజమైన లబ్ధిదారులకు పారదర్శకమైన సేవలు అందించడమే లక్ష్యంగా పనిచేస్తోందని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష స్పష్టం చేశారు. గురువారం పలాస మండలం, అమలకుడియ పంచాయతీ, వీరభద్రాపురం గ్రామంలో "మీ భూమి మీ హక్కు" కార్యక్రమంలో భాగంగా అర్హులైన రైతులకు పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీ కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో పట్టాదారు పుస్తకాల మీద కూడా నాయకుల ఫోటోలు ముద్రించి ప్రచారం చేసుకునే దుస్థితి ఉండేదని విమర్శించారు. దానికి భిన్నంగా కూటమి ప్రభుత్వం కేవలం ప్రభుత్వ అధికారిక ముద్రతో మాత్రమే పాస్ పుస్తకాలను అందిస్తోందని, కూటమి ప్రభుత్వ పాలన ప్రజల కోసం కానీ, నాయకుల ప్రచారం కోసం కాదన్నదానికి నిదర్శనమని ఆమె అన్నారు. భూమి హక్కు పత్రాలు రైతుల ఆత్మగౌరవానికి సంబంధించినవి అని వాటిని వ్యక్తిగత ప్రచారానికి వాడుకోవడం సరైంది కాదని ఆమె హితవు పలికారు. ఈ కార్యక్రమంలో పలాస మండలానికి చెందిన కూటమి పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు, పెద్ద సంఖ్యలో రైతులు, గ్రామ ప్రజలు పాల్గొని ప్రభుత్వ విధానాన్ని ప్రజలు హర్షించారు.

### ఇళ్ల నిర్మాణాలపై ఎమ్మెల్యే సమీక్ష

పలాస తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో గురువారం ప్రభుత్వ హౌసింగ్ విభాగం కార్యక్రమాలపై పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష ఆధ్వర్యంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ప్రభుత్వ హయాంలో చేపట్టిన హౌసింగ్ పథకాల పురోగతి, అవి ప్రజలకు ఏ మేరకు ప్రయోజనం చేకూరుస్తున్నాయనే విషయాలను ప్రధానంగా చర్చించారు. ప్రస్తుతం అమలులో ఉన్న హౌసింగ్ పథకాల పనితీరు వాటి అమలు విధానాలను క్షుణ్ణంగా సమీక్షించారు. ప్రజలకు గరిష్ట ప్రయోజనం చేకూరేలా ఈ పథకాలను ఎలా మరింత మెరుగ్గా ముందుకు తీసుకెళ్లాలనే అంశంపై అధికారులతో ఎమ్మెల్యే గౌతు శిరీష చర్చించారు. ఈ కార్యక్రమంలో శ్రీకాకుళం జిల్లా పి.డి. డి. రమాకాంత్ రావు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వెంపడాపు నర్సింగరావు, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వర్రి వెంకట సత్యజీ, సబ్ డివిజన్ డీఈవో యడం శ్రీనివాసరావు, ముఖ్య అధికారులు పాల్గొని ప్రజల సంక్షేమమే లక్ష్యంగా హౌసింగ్ కార్యక్రమాలను విజయవంతంగా అమలు చేయాలని ఈ సమావేశంలో నిర్ణయించారు.

### పేద ప్రజల ఆరోగ్యానికి ఆర్థిక భరోసా.. ముఖ్యమంత్రి సహాయ నిధి

పలాస నియోజకవర్గంలోని ఆపదలో ఉన్న ప్రజలకు అండగా నిలుస్తూ కూటమి ప్రభుత్వం సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నట్లు పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష తెలిపారు. ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) అనేది అనారోగ్యంతో బాధపడుతూ, ఆర్థికంగా చితికిపోయిన కుటుంబాలకు ఒక వరం లాంటిదని ఆమె పేర్కొన్నారు. గురువారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఒక కార్యక్రమంలో, నియోజకవర్గంలోని 20 మంది లబ్ధిదారులకు మొత్తం రూ. 10,85,655 విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఆమె స్వయంగా అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజల కష్టసుఖాల్లో పాలుపంచుకోవడం నా ప్రథమ కర్తవ్యం అని ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా ప్రతి ఒక్క అర్హుడికి సహాయం అందించేందుకు కృషి చేస్తున్నానని, ఇది ప్రభుత్వ బాధ్యత మాత్రమే కాదు, మానవతా దృక్పథంతో మనం అందించే భరోసా అని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయా వార్డులు, పంచాయతీలకు చెందిన ముఖ్య నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.






Printed and published and Owner by Chowdari Pramod Kumar , printed at Chowdari Printers, Near RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam-532001, AP.
Published at Near RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam-532001. Editor: Chowdari Pramod Kumar, E-mail:jatheeyavaartha@gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:2023/87546